సంబంధాలు

గోవిందరాజుల వెంకటసుబ్బారావు

"అరే!" "సుబ్బా! సంబంధాలనుగురించి వ్రాయరా" అని ఎవరో లీలగాగీకినట్లుంది. "పెండ్లిసంబంధాలా" అని వెంటనే అడిగాను. "కాదోయి! నాట్యకళలోని భాగాలకు" అని వెంటనే అంటించాడు.

సరే! 'అథాతో నాట్యజిజ్ఞాసా' అని కండ్లుమూసి చేతనైనంతచూశాను. "ఏం కనబడ్డవి" అని అడగండి. గ్రంథకర్త వకడూ; గ్రంథము వకటీ; కొంతమంది నటకులూ; ఒక హాలూ; టమటమాలూ; ప్రేక్షకులూ; ఒకఆటా; అది అయిపోవటం; రోడ్లమీద గుబ్బబ్బండ్లూ, మోటార్లూ కిలాకిలారావాలూ, విమర్శనలూ, బహూకరింపులూ. ఇక వరసనేవద్దాం.

గ్రంధకర్త:

వీరెవరూ? ఒకగ్రంథానికి కర్త—అదెందుకు వ్రాశాడూ? కర్మవల్ల—క్రియగ్రంథమవుతుందిగనకా, వ్యాకరణంపూర్తికావాలిగనకా. మరోవిధంగా చెపుదాం. నాటకం వ్రాసిన ఒకమహాపురుషుడు; ఒకవ్యక్తి; కడుమేధావి; అనుభవజ్ఞుడు; పండితుడు; గతాన్నీ భవిష్యత్తునూ చూడగలడు; హృద్యంగానూ, ఆర్యసమ్మతంగానూ, సంప్రదాయంగానూ చిత్రించగలడు: ఒకచిత్రకారు డన్నమాట. చిత్రకారుడు ఒకస్థితినివ్రాస్తే ఇతగాడు దాని పూర్ణగమనజీవితాల్ని వ్రాయగలడు. ఒకడు still-photographer, ఒకడు Film photographer.

ఇక విషయమా? అదో ఆది తుద, తలా తోకాగల పూర్ణమైనసందర్భము. మానవ చరిత్రమీదవుండే మమకారమో; కాదు, ఉద్భ్రాంతప్రేమో దివ్యదృష్టి నిచ్చిచూపించిందీ దృశ్యాన్ని. వర్తమానమానవవిజ్ఞానానికి లోకకల్యాణానికి వరిపిడిరాయిగాచేయమని గుబుల్కొలిపింది; వెక్కిరించింది.

చూసిందాన్నలాగే చిత్రించడం మొదలెట్టాడు. అదో వట్టికథ చెప్పినట్లయింది. తర్వాత కొన్నాళ్లు దానికి కొంతగమనం యిచ్చిచూశాడు; పూర్ణమైనరసం చిందలేదు; బుఱ్ఱ గోక్కున్నాడు. అసంపూర్తికివగచి వ్రేలుకొరుక్కున్నాడు. పూర్ణమైనజీవం పోస్తేగాని అన్నితిక్కలూతీరిగేటట్టు కనపడలేదు. ఏంజేస్తాడూ? ఆయావ్యక్తులతో స్నేహం మొదలెట్టాడు. వాళ్ల అట్టుపుట్టుఅనవాళ్లన్ని గ్రహించాడు. వాళ్లల్లో వేరువేరుగా పరకాయ ప్రవేశంచేసి, వాళ్లాడినమాటలూ, చేసినచేతలూ లిఖితరూపకంచేశాడు. స్థలసమయాల్లో కూడా లీనుడై దీన్నంతా ఇమిడ్చిపొదిగాడు.

ఏముందీ? ఆడటంమొదలెట్టింది: నవయౌవనారంభవార బాలికానృత్యంతో: గర్భస్థుడు భూపతనమై, ప్రకృతిస్ఫురించి, ప్రాణవాయువందుకొని, కెవ్వునయేడ్చి జీగించినట్లుగానూ ఒకచిట్టిలోకం సృష్టింపబడ్డది.

అతిలాఘవంమీద స్వకాయంచేరి 'బ్రతుకుజీవుడా' అని తెప్పరిల్లుతున్నాడు. కళ్లు తెరిచిచూచి, తనసృష్టికి తానే ఆశ్చర్యపడి, పరవశుడై ఉన్మత్తనృత్యంచేశాడు.

ఇంతటితో, ఊరుకోవచ్చునా? ఎందుకూరుకుంటాడూ? మగపిల్లవాడుపుడితే తండ్రి కుండేటంత ఆనందంతో తనప్రాణస్నేహితుడింటికి పరుగెత్తికెళ్లి వాడాకలి వీడాకలి మరచి తనగ్రంథాన్ని సజీవంగాచదివి వినిపిస్తాడు. అతగాడికికూడా యీపరవశం నృత్యం ముట్టిస్తాడు. ఇలాగే స్నేహితులకీ, ఎరుకగలవారికీ, పండితపామరులకూ, ఈశుభవర్తమానం అందిపోతుంది. "మనరామూడు పెండ్లికొడుకాయనూ" అన్నట్లు తానో గ్రంథకర్త-కాదు, సజీవపదార్థనిర్మాత అవుతున్నాడు.

ఉత్తమగ్రంథకర్త ఎవడురాఅంటే వీరేనన్నమాట. వారువ్రాసిందే ఉత్కృష్టమైన నాటకం అవుతూంది. ముద్దుకృష్ణగారి అనార్కలీ నాబుద్ధికి అట్టి ఉన్నతకావ్యంలా తోచింది. చురుకుదనం, ఆవేశం, దృష్టి, ఇంకా నాతెలివికందగానివి కొన్ని, అన్ని పరికరాలూ సరిగ్గాఉండుకుంటే కొన్నిగంటల్లో వ్రాతఅనేనిమిత్తాన్ని పూర్తిచేయగలడు, ఆహారవిహారాలుకూడా వర్జించి. ఇట్టి ఉత్తమకావ్యాలు ఏభాషలోనైనా బహుకొలది-స్వల్ప పాటిమాత్రమే ఉన్నాయి.

ఇక మధ్యములున్నారు. ఆ కలిగిన కొద్దిఆవేశానికో, పూర్ణావేశానికో శిక్షాబుద్ధులు చెబుతూ, మాసాలూ, సంవత్సరాలూ, (జీవితంవుంటే యుగాలూ) కూర్చొనివ్రాసేవారు వీరు. గొప్పగొప్ప కావ్యకర్తలని మనము సాధారణముగా పిలుచుకొనేవారు యీతరగతిలోవారు. ఎప్పుడైన అదృష్టంవల్లనూ శ్రమదమాలమీదనూ ఒక్కొకప్పుడు ఒక్కొక్క-కావ్యములో వీరు ఉత్తమకావ్యకర్తలతరగతికెక్కటం శోచనీయంకాదు. ఆఆలస్యాలవల్ల, నట్లవల్ల పూజలూ, జిలుగులూ చెక్కబడతవేమో కాని సహజసౌందర్య సౌకుమార్య గంభీరత్వాలు చంపబడుతూనేఉంటాయి. రాజీపద్ధతులమీదనుండే Art conventions, మతావేశాలూ మొదలైనవి ఇంకెన్నో వీళ్లకొంప తీస్తున్నాయి: తీసినైకూడానూ. Focussingలోనో, Exposureలోనో, Developmentలోనో, యింకా వీట్లో వకదాంట్లోనో, అన్నింట్లోనో, కొంతడింకాకొట్టిన Photographerలు వీరు. వీరిసంఖ్య ఏభాషావంక చూచినా కొలదిపాటిమాత్రమేవుంది.

ఇక అధములున్నారు. వీరిసంఖ్య అగణ్యము. ప్రతిపెంటకుప్పమీదా, ప్రతిరైలుస్టేషనులోనూ కనబడుతూనేఉంటారు. వీరికి దృష్టిలేదు, ఆవేశమూలేదు, ఏదీలేదు. పెళ్లాం మాత్రం "మావారుకూడా ఎన్నోనాటకాలు రాశారు, ఎంతోగొప్పవారు సుమా" అనిమటుకు అనుకుంటుంది. నాటకాల్లో కుకవినింద అనేభాగంలేదు కాని ఉంటే ఆభాగంలోకి వీరొస్తారు.

గ్రంథం:

ఇదో సజీవపదార్థం. ముట్టుకుంటేనే చలిస్తుంది. చదివితే తనభావసమానాలు ప్రకాశిస్తూ, నవ్వుతూ, లాలించి, తనలోకి లీనంచేసుకుంటుంది. ఇట్టి వాఙ్మయసర్వస్వంలో అత్యుత్కృష్టదశలోనున్న కావ్యకన్యక, నాటకము, పూర్వము ముద్రణయంత్రాలు లేనప్పుడు, తాళపత్రాలమీదనో, కొండపల్లికాగితాలమీదనో లిఖింపించుకొనేది. అవక్కప్రతి గ్రంథ

కర్తగారిదగ్గర్నే ఉండిపోయేది. పోయేదికూడానేమో! ఉన్నవాటినిచూస్తే కొలదిసంఖ్యైనా, నశించిపోయిన ఉత్తమకావ్యాలు అట్టిమనుష్యుల్లాగానే ఎన్నో చెప్పలేనన్ని ఉన్నాయని నావూహ. లేదా మరొకచిక్కు తటస్థిస్తూఉండేది. మాతృకనుబట్టి కళాపిపాసువులు కొన్ని ప్రతులు తయారుచేస్తూండేవారు. దానివల్ల ప్రతిభ వృద్ధైనా వీరికి భావం తెలియకపోవటంవల్లా, స్వంతపైత్యాలు ఇరికించాలనే దుర్బుద్ధులవల్లా కొన్నివికృతరూపప్రతులు బైటబడుతూండేవి. కాని ముద్రణయంత్రాలతో యీకష్టాలన్నీ తీరిపోయేవి. ఇప్పుడూ జనబాహుళ్యానికి గొప్ప నాటకరాజాలదగ్గిర్నించీ అధమనాటకపూజ్యాలదాకా అందిపోతున్నాయి.

అమ్ముడుపొయ్యే ప్రతులనుబట్టికాదు, వేసిన పునర్ముద్రణాల సంఖ్యనుబట్టికాదు నాటకం విలువ మనము పరిగణించేది. అది తరుచు రంజకత్వం వాసిపోకుండా పైపెచ్చు వృద్ధిచేస్తూ ఆడబడుతూందా లేదా అనేదాన్నిబట్టి మాత్రమే. వర్తమానంలో దీనికి చాలా Exceptions వున్నాయి. అవి మరోప్పుడు మనవిచేస్తాను. నేను మొదట సెలవిచ్చినట్లా కర్మవిపాకంవల్లా, బీదతనంవల్లా కోమలకావ్యకన్యకలను గ్రంథకర్తలు లుబ్ధావధాన్లకు నుబ్బినంటగట్టినట్టు Editor అనే కాపీరైటు Shylock లకు అమ్ముకుంటున్నారు. కాని అది వేపం విప్పేసుకొని స్వస్థానం చేరుతూనే వుంటుంది. వాఙ్మయచరిత్రలు చూస్తే యిట్టి దారుణచరిత్రాలు చాలా ఉత్తమకావ్యాలకు చదవవలసివస్తుంది.

నిజంపరికిస్తే నాటకాన్ని చూస్తాంకాని, చదవము. అంతేనంటారా? ఖేలనకు ఉపయోగించాల్సిందాన్ని చదివితే ఏంలాభం? ఏంవుపయోగం? "బాగుంది. బాగుంది. ఆహా! ఓహో!" అనుకుంటాం కాని పరిపూర్ణత్వం ఎక్కణ్నుంచి తెద్దాం? ఎంతసౌందర్యవతియైనా అభినయిస్తూఉండేటప్పుడు మనకు కలిగే నిర్భరానందం అది బొమ్మలా అందరికీ నమస్కరించి నిబ్బున్నప్పుడు కలుగుతుందా? విప్పారనిపువ్వు మొగ్గగాఉన్నప్పుడు నిన్నెలా నవ్వించి, కవ్వించి లీనంచేసుకుంటుంది? గ్రంథకర్తకున్న రసస్థితే మనకుంటే ఖేలనతో అవసరమేలేదు. అన్నీ మనోనేత్రంతోటే చూస్తాం. ఏమంటారు?

అదీకాక విజ్ఞానప్రచారం అనే గొప్పఆశయంకూడా ఉంది. అది ఖేలనంలేందే లభించదే! అందుకుకూడానైనా నాటకం ఆడవలసివస్తుంది. లేకుంటే ఆయిచ్చేటిక్కెట్టు డబ్బులకు తలో నాటకంప్రతీ యిచ్చి యింటికి పొమ్మందామా? అదీ ఆలోచనీయాంశమే.

చదివే నాటకాలు అని ఫక్తుకొన్నివున్నాయని కొంతమంది అనంగా విన్నాను: అన్యభాషలలో, దానికేమి మనభాషలోకూడా అలాంటివి వున్నాయని నేను వప్పుకుంటాను. అవి నాటకాలని పేరుపెట్టకుండా మరోవిధంగావ్రాసినా హృద్యంగానే ఉంటాయి. ఆడటానికి వీల్లేని నాటకం, కష్టపడి ఆలావీల్లేకుండా వ్రాసిన నాటకం నాటకమనిపించుకోదు. బూటకం అని మరోపేరివ్వండి. Novel Drama అనో, Living Story అనో మరేమైనా మీనోటికొచ్చినపేరో.

కాని అయ్యా! మరోవిధంగాచూస్తే ప్రతినాటకం ఆడొచ్చు. ఎందుకాడగూడదూ? మనమిప్పుడాడటం లేదూ? కొన్ని రెండురోజులూ మూడురోజులూ ఆడతగినంత స్థూలకాయా

లున్నాయి. ఏంలాభం? చింతాకుమోస్తరు రసంరాదు. వినుగుపుట్టిస్తాయి. ఏ Disterted Vision నో, ఏ Inspiration నశింపో, మరేదుర్బుద్ధో, లేక చూసేవాళ్లకు Imagination తక్కువనేభ్రమో తటస్థించటంవల్లనో, విరివిగా ప్రస్తరించి, బాహుళ్యంగా M.S.M.Ry. Buildingsలా ఖెడగీకిన మహామహులున్నారు. వారికి నా నమస్కారం.

విషయంగొప్పది గనకనే అంతస్థూలాలుగా పరిణమించినై అనగలరు. ఎంతపెద్ద విషయమైనా పరికించి చూడండి. దానిలో ఉండే కొలికిపూస–ఆత్మ చాలా సూక్ష్మంగానే ఉంటుంది. అందులో అతిసూక్ష్మంగా ఉండటంకూడా నైజం. దాన్ని కొంతపనితనమెరిగి సొగసుగా సానబెట్టి, స్వర్ణంలో పొదిగి వెలిబరిస్తే చాలు, పదివేలు.

రామాయణం, భారతం, భాగవతం 'కలిపికొట్టరా కస్తూరిరంగా' అని సంపూర్ణపండితులు రాస్తే కన్నయ్యగారి నాటకాలులాగా ప్రజలను మునుగులనూ ఆకర్షిస్తాయి గాని పండితులకు చోటేది? అవి ఫిలుములు తీయండి, టాకీలు చేయండి; నాటకనామకం దయచేసి చేయకండి. అది కేవలం Swindling గూ, Trading on ignorance అని నేచెప్తే, చాలా మృదువుగా పలికాననుకోండి.

నిజమైన నాటకం ఏకరాత్రమే. వివాహంలా వేదసమ్మతమును, శాస్త్రసమ్మతమునూ. దాంట్లో విష్కంభాలు రాసివుండవు. నటకులుగూడా తమ స్వంతవిష్కంభాలు వేలెట్టడానికి అసలే వీల్లేదు. ఆ అధికారంలేదుకూడానూ. నాందినుంచి మంగళంవరకు సొంతంగా నయభయాల్తో కిక్కురుమనకుండా ఆడవాలి. అక్కడక్కడా స్వంతపైత్యాలకు తావులేదని నేను వ్రాయకుండానే గ్రహించండి.

అయ్యా! అంతమోజుంటే ఇప్పుడున్న నాటకాలను తిరిగి వ్రాసి కట్టుబాట్లకు అనుసరణీయాలు చేసుకోండి పండితసమ్మతిమీద. కావాలిస్తే పునర్ముద్రణాలు చేయండి. స్టేజిమీద కొత్త ఎడిషన్లు మాత్రము తయారుచేయకండి. దీనంతపాపం నాకు ఇంకఏదీకనపడలేదు. పండ్లు బిగించి గద్గదికతో 'Murder చేయకండి' అని ప్రార్థిస్తున్నాను.

ఏవిధంగా ఉండాలి యీ నాటకాలని మీరు ప్రశ్నిస్తే దానికి జవాబు యివ్వాలంటే నాటకరచన, విధానం, నిబంధనాలు, అవసరాలు, అనవసరాలు మొదలైన చర్చలోకి దిగాలి. దాన్ని పండితులకు, పరిషత్తులకు వదలివేస్తున్నాను. కర్తలులాగానే వారి యీసృష్టులకు కూడా ఉత్తమ మధ్యమ అధమ తరగతులున్నాయి. రామరాజభూషణుడి 'భావం బెక్కడలేక వృత్తనియమాపాయంబు.........సామాన్యాకృతింబోలె పైపై వన్నెల్ పచరించినన్......దాని తిలకింపంబోరుధీరోత్తముల్' అనే పద్యం జ్ఞప్తిఉంచుకుంటే ఇప్పుడు పై చెప్పినా కొన్ని మధ్యమాలు, కొన్ని అధమాలు దాంట్లోకొస్తై అని తోస్తుంది.

Printed at Lodhra Press & Published by N. V. Seshiah
at 7, Thambu Chetty St., G. T., Madras.

http://www.maganti.org

Source: Press Academy Website, Natya Kala, Dec 1934

Disclaimer: This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan